# మెనీ మైల్స్ టు గో! అండ్ మెనీ ప్రామిసెస్ టు ఫుల్‌ఫిల్!

డా॥ సోమసుందర్

**అవును! ... ఇంకా ఎన్నో మైళ్ల దూరం పురోగమించాలి! ఇంకా ఎన్నో వాగ్దానాలు నెరవేరాలి! నన్ను కన్న ఈ తల్లి పుడమికి ఎన్నెన్ని చేయాలింకా? ఎన్ని బొమ్మజెముడు ముళ్లడొంకల్ని - కూకటివేళ్లతోసహా తొలగించాలి! ఎన్నెన్ని వాగ్దానాల వర్షధారలనీ ఎండిన గుండెల నెరియల్లో నింపాలి!**

నేను వచ్చేటప్పుడు ఏమేమి తెచ్చుకువచ్చానో గుర్తులేదు. అసలు నాకు కొంచమైనా తెలిస్తే కదా? కళ్లు తెరచి నలుదిశలూ పరికించేసరికి - నా పితరులు చక్కదిద్దిన ముత్యాలపందిరి కనిపించింది. ఎన్నో దీపకళికలు తేజరిల్లాయి! అనుస్యూతంగా సాగివచ్చిన సాంస్కృతికామృతధారలు పల్చగానైనా ముందుకు సాగుతున్నాయి!

ఇంతకీ నేను వెళ్లిపోయేటప్పుడు ఏమేమి తీసుకుపోవాలో - ఎలా తేల్చుకోను? పుడమినిండా ఎన్ని వస్తువులు నింపానో? ఎన్నెన్ని పదార్థాలు సంకలించానో ఎవరు చెబుతారు? ఎన్నెన్ని ఖనిజాలు శోధించానో? ఎన్నెన్ని పర్వతాలకు గర్వకారణంగా హరితశిఖరాల సమకూర్చానో? ఎన్ని నిజాలు, ఎంత లోతు నీరసాలు! - ఇన్నిటిలో నేను సంతరించినవేవో ఎవరు వివరిస్తారు? ఎవరైనా విశుద్ధ మనస్కులు విశదపరచనిదే - నాకు మాత్రం ఎలా తెలిసేను?

ఏవి నావో, ఏవి పితరులవో, ఏవేవి అగ్రజులవో ఎలా తేల్చుకోను?

అందుకే ఒక్కటే నిర్ణయించుకున్నాను; "యహాకె దౌలత్ యహా రహేగా!" అని. అవునవును ఎవరో దూరం నుంచి పాట వినిపిస్తున్నారు; "బహుత్ దూర్ జానా! అకేలా హీ జానా పడేగా!" అంటూ ... బహుశా నా కోసమే కాబోలు! నా కోసం ఇంత హృద్యసందేశమిచ్చే నేపథ్య తిమిరాల చీల్చే వెలుగుతురు గొంతులెత్తే మహనీయులందరికీ వందనమందిస్తాను ... నన్ను కార్యోన్ముఖుని చేస్తూ కర్తవ్యాలు ఉపదేశిస్తూ ఆ మహానుభావులెంత ఉదారులు?

కాలం అనంతవాహినిగా సాగిపోతోంది. అందుకేనా ఆ మహాకవి - "కాలోహ్యాం నిరవధి ... విపులాచ పృథ్వీ" అంటూ ఎంత జీవనానుభవసారం వివరించాడు! ఎంత అనుభూతి పారమ్యత? ఎంత లోతైన సత్యజ్ఞాన విచికిత్స?

ఏమైనా ఎవరైనా నా కోసం అజ్ఞాత లోకాలనుంచి, గొంతెత్తి పిలుచుకుంటూ వచ్చినప్పుడు - చేతులు విశాలంగా చాచి, ఆనందంతో ఆహ్వానిస్తాను. ప్రేమారగా అక్కున చేర్చుకుంటాను.


ఆ ఆగంతకుని వదనంలో నా ముఖకవళికలే పోల్చుకుంటాను! సాదరంగా స్వాగతమందిస్తాను! హాయిగా చేతులూపుకుంటూ ఆగంతకుని అనుసరిస్తాను. చేతులు ఖాళీగా ఉండిపోతేనేం గాక? గుండెనిండా ఎన్నెన్ని స్మృతుల బరువులో!

నేను నడువవలసిన దూరభారాలనిండా కొత్త వెలుగులే ప్రసరిస్తూ సాగు తాను. నేను నెరవేర్చవలసిన వాగ్దానాలతో నా సోదరనరుల హృదయాలను సంతుష్ట మొనరిస్తాను? ఎంతో ఉపశాంతి కలిగిస్తాను ... నాతోపాటు ఏమీ తీసుకుపోకపోయినా, చెరగని చిరునవ్వుల్ని మాత్రం తప్పకుండా కొనిపోతాను. చివరి నిమిషం వరకూ దాచుకున్న నా దరహాసాలు - నా జాతి జనుల కర్పించంగా, నా కోసం మిగుల్చుకున్న ఆనందరేఖలు! చాంద్రీస్మితచారుధారలు!! అవి చాలవా నాకు స్వర్గపాథేయాలుగా! ...

నా పసితనంలో ఎప్పుడో ఒక ముసలాయన నా గుండెల్లో దూరాడు. ఎలా ప్రవేశించాడో - స్తిమితంగా బైఠాయించాడు. అప్పటినించీ అదే పనిగా రాట్నం ఒడుకుతూనే ఉన్నాడు! ఝుంఝుమ్మంటూ ఒక్కటే మోత! లక్షలాది తేనెటీగలు నా తలచుట్టూ పరిభ్రమిస్తున్నట్లు - తరగని ఆందోళన!

ఎన్ని కదుళ్లో? ఎన్ని ఏకులో? ఎన్నెన్ని చిలపలో? ఎన్ని వేల మైళ్ల దారం తీశాడో? ఎన్నివందల కుళ్లాయిలు నేయించుకున్నాడో?

కట్టుకున్న బట్ట మార్చినట్లే కనిపించడు. మరేం





చేసుకుంటాడో?

మైళ్లంటే జ్ఞాపకం వచ్చింది - మైలురాళ్ల గమ్యం చూపవన్నాను కానా? అది ఎంత అబద్ధం! మైలు రాళ్లూ కదులుతాయి; బాటసారిని జాలిగా పలకరిస్తాయి. అనుగు సోదరా తిరిగి రావా? అని ఎంతో ఆత్మీయంగా అర్థిస్తూ వీడ్కోలిస్తాయి! నడుమ నడుమ రంగులూ మర్చుకుంటాయి; గమ్యస్థలం గురించి బోధిస్తాయి. అవసరమైన సమయంలో దిక్కు మార్చుకోమనీ ఉపదేశిస్తాయి! మైలురాళ్ల ఘనతర మిత్రులు తెరువరికి!

ఉత్త శిలాఖండాల్ని హస్త లాఘవంతో బొమ్మగా

**పాఠకులకు మనవి**

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సోమవారం మార్కెట్లోకి విడుదలవుతుంది. మీ ఊళ్లో, మీదగ్గరి షాపులో ఆరోజున విడుదల కాకపోతే దయచేసి ఈ కింది చిరునామాకు తెలియచేయండి.

సీనియర్ సర్క్యులేషన్ మేనేజర్,
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక,
ఎక్స్‌ప్రెస్ సెంటర్, లోయర్ టాంక్‌బండ్,
దోమల్‌గూడ, హైదరాబాద్-29.
ఫోన్: 3223586, 3223587.

-ఎడిటర్.


శిల్పీకరిస్తే - వెంటనే అది దేవతామూర్తిగా భ్రమింపచేస్తుంది. మూఢులపై కత్తి దూస్తుంది. తన్ను పూజించమనీ, రాశులుగా నైవేద్యాలందించమనీ, పాలతో అభిషేకించమనీ దండిస్తుంది.

అలాంటి కితవ ధిక్కార మెరుగదు మైలురాయి! దీనికి ముఖకవళికలు లేవు. వర్చస్సు ఉండదు. సంఖ్యావాచకమే తప్ప వ్యక్తిత్వముద్రలేమీ కోరదు. అజ్ఞాతహస్తాలు మృదువుగా ఎత్తి - బాటసారి మొగంపై పథిశ్రమా స్వేదాన్ని తుడుస్తూ ఓదారుస్తుంది. సాగవలసిన దూరం తెలుపుతుంది - ఆగవలసిన నెలవూ నిర్దేశిస్తుంది. మైలురాయి ఉపదేశం సుహృత్సమ్మితంగా ... మైత్రీగాత్రంగా ... నిరాడంబరంగా ...

మైలురాళ్లనే అనుసరించి, గమ్యాన్ని వెదుక్కొనే వాడిని వెంగళాయిగా వేళాకోళం చేశారు విజ్ఞులు! కానీ నిజమైన పాంథశాలికి, దానికి మించిన దిక్కేమిటి?

నీడ ననుసరించి మనిషి ఆకృతిని పోల్చుకుందుకు యత్నించే జిజ్ఞాసువుని వ్యర్థునిగా శాసిస్తారు - బుద్ధిమంతులు! కాని వాళ్లెవరూ అచ్చమైన మనిషిని పోల్చుకునే మార్గాలుపదేశించలేదు! వాళ్లూ మైలురాళ్లనే అనుసరించి యాత్ర సాగించారు ..

సంయమనమూ, క్షమ, అవగాహనా నేర్పని ఋషులు ఎంత గొప్ప కీర్తిమంతులైతేనేం - మనిషికేం మిగిల్చారు? మాటలగారడీతో వంచన చేశారు. 'అమృతస్య పుత్రా' అంటూ తీయగా వీపు నిమిరారు. తమ కీర్తిపతాకలాతని భుజానికెత్తి మోయించారు! వైవిధ్యభరితమైన ఈ జీవిత మహారథ్యలో, మైలురాళ్ల తప్ప ఏమ్మిగిలేను? పరాయితనాన్ని తొలగించి మమకారాల సేతువులు నిర్మించినవారెంతమంది?

నా గుండెల్లో దూరిన ముసలాయన మాత్రం నూలుపోగులతో 'రోప్ వే'లు నిర్మించాడు. కదుళ్ల నిలిపి వంతెనలు కట్టాడు. ఒక్కొక్క నిర్భాగ్యుణ్ణీ రెక్క పుచ్చుకొని అవతలికి నడిపించాడు. తానూ నడిచాడు - నరమానవుల ననుసరిస్తూ ... చివరికి తెములుచ్చుకొని నా గుండెల్లోకి దూరి రేవిణీ వేసుకున్నాడు!

కుసుమస్తబకాలైనా, కొరకంచులైనా ఆయనకెప్పుడూ ఒక్కటే విలువ! తాను నిర్మించిన నూత్నభవనానికి ఏకులతోనే రీ-ఇన్‌ఫోర్స్ చేశాడు. ఇంద్రజాలికుడు కాదు గదా? ఎందరిలోనో దురవగాహనలు ప్రోదిచేశాడు. పిదపకాలం ధర్మమా అని పుట్టుకువచ్చిన కురచబుద్ధులా. ముసలాయన్ని ఎన్ని నిందలకు గురిచేశాయో?!

ఐనా ఆయన పెదవులపై చిరునవ్వులారిపోలేదు - కాళ్లలో వేళ్ల వేగం వీగిపోలేదు. చేతుల్లోని నిరంతరకర్మణ్యత్వం నిష్క్రమించలేదు!

నిజమే మరి, ఈ దేశంలో ఋషులంటే అనుమానం ఈనాటిది కాదు. ఏలికల నాలుకల మెలికల ననుసరించి ఆర్షవాక్కులెన్నిమార్లు మడతలు పడ్డాయో? వంకర్లు తిరిగాయో? ప్రజాపరంపర ఎరగకపోలేదు!

పైగా ఈ ముసలాయన చెప్పిన మాటలు శుద్ధ సాధారణవాక్కులు! రూపకాలంకారాలెరుగడు. ఉపమాల విందులొనర్చలేదు. ఘాటుగా ఉద్ఘాటనలు చేయలేదు. జనం అనుమానించరా మరి! సాదాజనుల మాటకేం - ధిషణావిభీషణులు శంకించకూరుకుంటారా?

ఆలోచించిన కొద్దిమందికేనా ఆయన వాక్కులెంత భావబంధురాలో అర్థమైంది. ఎంత పుష్కల తాత్త్వికచింతనావిదగ్ధాలో బోధపడింది. ఆయన నిప్పులో దుమకడానికి సిద్ధపడమన్నాడు. జనం సరేనన్నారు. ముప్పుల్లో సంసారాలు ములుగుతాయన్నాడు. ఫరవాలేదన్నారు జనం! ఉప్పుతో విపత్తు కొనుక్కోమన్నాడు. కిమ్మనలేదు ప్రజలు ...

ముసలాయన నడిచినంతమేరా ఉన్నతోన్నత గగనం నిశ్శబ్దంగా స్తబ్దుగా ఉండిపోలేదు. నెలవంక మొగం నిండా జనాల పాదధూళులు క్రమ్మినా వెలవెలలాడలేదు! కడుపు కక్కుర్తికోసం రెక్కలు విరుచుకున్న జనం సైతం - నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోలేదు. ఆ పెదవుల నుంచి రాలిన ఏ మాటా ప్రతిధ్వానం కలిగించకుండా - గాలిలో కలిసిపోలేదు!

ఆయన అన్నాడు కదా: "మీ బతుకులనిండా తారు పులిమారు వాళ్లు! దాన్ని పొరలు పొరలుగా తొలగించడానికే వచ్చాను. నేను మీవాణ్ణి ... కాలధారలొంపి మీ హృదయాలను కడుగుతాను. మీ దేహాలను ఆపాదమస్తకం ప్రక్షాళన మొనరిస్తాను. మీ సేవకుడ్ని! యథార్థ స్వచ్ఛకాంతులావిష్కరించడానికే వచ్చాను ... కాంచనమయ హరిద్రాభాన్నీ, రజతధావళ్యాన్నీ ఆవిష్కరిస్తాను!" ... ఆ ముసలాయన మాటలు అంత చప్పున ఎవరు నమ్ముతారు?

వేలాదివత్సరాల పరాయి బానిసత్వాల ఇడుములు గుడిసిన బడుగులు కదా?!

"మీ పార్థివశరీరాలలో దాగిన పవిత్రాత్మలను, వెలువరించే నా ప్రయత్నాన్ని ప్రోత్సహించండి! సహకరించండి!! మీ శరీరావధులన్నీ మంచుగడ్డలతో కప్పబడ్డాయి ... మీ నివాసాలలోనే శ్మశానాలు విడిది చేస్తున్నాయి కదా? గమనించరేల!" అన్నాడు దీనంగా ముసలాయన.

"ఇదిగో నేడే నా చరమసంకల్పాన్ని ప్రకటిస్తున్నాను. ఇది ఆత్మహత్యాసదృశ మనుకునే వాళ్లున్నారని నాకు తెలుసు. పరభాగ్యోప జీవులెందుకుండరు? 'కర్తవ్యమో - మర్తవ్యమో' ఏదో ఒక్కటే కోరుకొండి. మంత్రనగరికి పోయే మార్గాలెన్నో ఉండవు! ఒకే దారి, ఒకే దర్శనం!" హెచ్చరించాడాయన.

మునిమాపుల మసగలలో దిగ్భిత్తికలను నాకుతూ గడిపారు కొందరు. వారి నాలుకల కొసలు మొద్దుబారి మాటలుతడబడుతున్నా గమనించలేదు. వేకువ నునులేత వెలుగులు తూరుపుతెరలు తొలగించుకుంటూ తచ్చాడుతున్న సమయంలో మాత్రం కొన్ని మొద్దునాలుకలపై కూడా బీజాక్షరాలు మొలిచాయి! శీర్షాలు నడిమింటి కెగశాయి ... చేతులు చెయిదాలందుకున్నాయి. పాదాలు పథంతరాల మింగనారంభించాయి!

కొందరు శంకాత్ములకు మాత్రం ఆయన

వాక్కులలోని ప్రసాదగుణమంటేమ. సద్యః స్ఫూర్తితో మనసులు వెలగలేదు. పడమటిదిక్కుకు అతికించుకొన్న కన్నులు ఊడిరావడంలేదు!

వెనువెంటనే యాత్రకు సన్నద్ధమైన వారెందరో! ఎంత విశాలపథాలయినా ఇరుకుగా ఒరుసుకుపోయాయి! ఇంత అనంత విహాయసమూ జనత ధ్వనితరంగాలతో క్రమ్ముకుంది. గురుత్వం కోల్పోయింది.

ఉత్ప్రేక్షలూ అతిశయోక్తులూ నిర్వీర్యమైపోయాయి!

పశ్చిమాభిముఖంగా దూరతీరాలకు పోయిన కొందరు తమ పితృప్రపితామహుల వీపులు చీల్చిన గాయాలు స్మరణకు తెచ్చుకోనారంభించారు. లెక్కించుకున్నారు. శృంగారాగ్రాలుగా తమ మ్రోల సంచరిస్తున్న రంగురంగులు సీతాకోకచిలుకల విహారాలన్నీ శత్రువులు పన్నిన పాచికలుగా పోల్చుకున్నారు. కనులముందు గాలిలో ఎగురుతున్న విచిత్ర వర్ణాంచితాలైన పిట్టల ఎరికలు ఎంతమాత్రమింక విభ్రమంలో ముంచజాలవనుకున్నారు ... పశ్చిమాకాశ శిఖరాల నుంచి దరహాసచంద్రికలు కురుస్తూ దిగి వస్తున్న అప్సరాంగనలు తమ తపోభంగ వ్యూహాలేనని పోల్చుకున్నారు.

పాతివ్రత్యభారాల మృషాబోధలతో కృశించిన వనితలు, సహగమన ధర్మాగ్నులకాహుతి కాబోయే మహిళామణులూ - ఎందరో సంకెళ్లు తెంచుకున్నారు. ఒక్క అదటున స్వేచ్ఛా ప్రాణవాయువులు ఆఘ్రాణించారు. నవకవితా సృజనోత్సాహంతో విలంఘించారు. ఊరకాకులు వసంత వనకోకిలలై గొంతులెత్తారు!

అప్పుడు ప్రారంభించాయి మైలు రాళ్లు నడక! అది నడకా? కానే కాదు. పరుగా? అదీ కాదు ... వాయువేగంతో మనోవేగాన్ని అనుసంధించిన తేజోమయ గీతాఝరి!

కస్తూరి పరిమళంవలె ఎంత ఘాటుగా ఉన్నా - అంత విడువలేని ఆకర్షణ! ముసలాయన సంకల్పం అంత అనుల్లంఘనీయం!

సరిగ్గా అప్పుడే నా హృదయకవాటాలు త్రోసుకుంటూ ఆ ముసలాయన ప్రవేశించాడు. అస్తోకశోకాలు నా మానసాకాశంలో ముసల రనారంభించాయి. ముప్పిరి కొననారంభించాయి ... అప్పుడే ఆయన ఏకులు ఒడక నారంభించాడు. ఊపిరిసలపనీయడు! ఒక్కటే మోత! నా ఎట్టఎదుట మైలురాళ్లు పరుగులంకించుకున్నాయి.

శతాబ్దాలుగా ఆగిపోయిన కాలం ఉన్న పట్టాన దుమికింది. గతంనుంచి సుదూర భవిష్యత్తులోకి! వర్తమానమంటేనే సంచలనాత్మక యాత్ర! నిన్నటి గంటలు - దీర్ఘయామినుల చీకట్లు! నిన్నటి బతుక్కి స్థితే తప్ప గతి లేదు!!

మాఘమాసపు దీర్ఘరాత్రులులలో నా గుండెల్లో ఆ ముసలాయన చలిమంటలు వేశాడు! ధ్వాంతశర్వరులు భళ్లున బద్దలయ్యాయి. నా కనులముందే మాయజలతారు జలదాలను చీల్చుకుంటూ ఆదిత్యకిరణ మాలికలు ... జాగృత దీధితులు!

నా వస్త్రాలను ముంచిన నెత్తుటి మరకలు అంతర్ధానమయ్యాయి. శుభ్రధౌత వస్త్రధారినై ఆరుబయట నిలిచాను. నా పసితనాల ఇక్కట్ల గొలుసుకట్లన్నీ పటపట తెగిపోయాయి!

ఒడళ్లపై కారే పచ్చి నెత్తురులు నాలుకతో నాకే ఏకాకిత్వాల దైన్యాలను నా జాతి విసిరేసింది. నగరాల అధిష్ఠానాల బలాలు కొద్దికొద్దిగా సంగ్రహించగా నా జాతి జనుల బలం పెంపసలారింది! శత్రునివహాలను శోకజలబంధం చేశాడు దినకరుడు!

నా నయనాలు స్వప్నాలోకనలో జ్యోతిష్మతులై విస్తరించాయి!

నా గుండెలోని ముసలాడు నా వంకే చిరునవ్వుతూ చూస్తున్న దృశ్యం తటాలున ఆనగానే కంపించిపోయిన క్షణాలు జ్ఞాపకం వచ్చాయి!

ఆయన నా హృదయంలో నింపిన మహాకావ్యం - దివ్యధ్వనిపూర్ణం! నర్మగర్భంగా ఎన్నెన్ని భావాలో?

వేదకాలాలనుంచి ఆధునిక యుగం వరకూ, విస్తృతమై వచ్చిన అనంత వైదుష్యాలు నా హృదయంలో మోగనారంభించాయి. ఒక అనంత వారసత్వం నా నరాలనుద్రేకిస్తుంది. ఒక హెచ్చరిక ... ఒక సవాలు ...ఒక ప్రతిజ్ఞ...ఆయన సంకల్పంలో వేయిరేకులొక్కమారే విరిసిన శతార కిరణ జ్వాల!

కర్తవ్యపాలనమై ఇన్ని దశకాలైపోయిందా - అయినా గుండెలోని ముసలాయన రాట్నం ఒడకడం మానలేదు! అదేం చిత్రమో ఆ మధుప ఝుంకారంలో ఎన్నెన్ని భాషలో అంతర్నిబిడమైపోయాయి!

ఆయన జ్ఞాపకం చేస్తూనే ఉన్నాడు. ఇంకా ఎన్నో మైళ్ల దూరం ముందుకు సాగాలి. ఇంకా ఎన్నో వాగ్దానాలు నెరవేర్చాలి! ఇంకా ఎన్నెన్ని ముళ్లడొంకలో - కూకటివేళ్లతో పెకలించి దహనం చేయాలి!

నేను వచ్చేటప్పుడు ఏమేమి తెచ్చుకు వచ్చానో గుర్తులేదు. నేను వెళ్లేటప్పుడు ఏమేమి తీసుకుపోదలచానో తెలుసుకోలేదు.

కానీ ఒక్కటి మాత్రం నిజం ... వచ్చేటప్పుడు తెచ్చుకున్నవి కర్తవ్యాలు! వెళ్లేటప్పుడు తీసుకుపోయేవి కృతార్థతలు! ఆ తృప్తి చాలదా???

■

